



# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 07, 2026 | సంపుటి : 2 | సంచిక : 236 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి,జూన్6 :**
రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు.

2లో..

## రూ.లక్ష కోట్ల విలువైన భూమిని
# ప్రభుత్వం బడాబాబులకు కట్టబెడుతోంది

**సీఎం సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు బందిపోట్ల మాదిరిగా దోచుకుంటున్నారు**

- వాళ్ల భూదందాలను వరుస బెట్టి ఆధారాలతో సహా బయటపెడతా
- కాంగ్రెస్ కు ఇదే ఆఖరి సర్కార్.. 20 ఏళ్లు ఆ పార్టీని బొందపెట్టే పనులను రేవంత్ రెడ్డి చేస్తున్నాడు
- బీఆర్ఎస్ ఉన్నప్పుడు భూ దోపిడికి కిటికీలు తెరిస్తే రేవంత్ రెడ్డి తలుపు తెరిచాడు
- ప్రాణం పోయినా సరే తెలంగాణలో ఇంచు భూమిని దోపిడీ చేయనివ్వం
- 10 ఎకరాల శిఖం భూమి కొన్న పవన్ కళ్యాణ్ వెంటనే తిరిగి ఇచ్చేయాలి
- ఆంధ్రా విష కోరల్లోంచి తెలంగాణను సాధించుకున్నాం.. కచ్చితంగా తెలంగాణ మా జాగీరే
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్ బ్యూరో జూన్ 6 నేటితరం**
రేవంత్ రెడ్డి సర్కార్ లక్ష కోట్ల భూదోపిడీకి తెరతీసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పేదలకు అన్యాయం చేస్తూ పెద్దలకు ఈ భూములను కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రను బట్టబయలు చేస్తామన్నారు. రేవంత్ సర్కార్ భూదోపిడీని సాక్ష్యాధారాలతో వరుసగా ప్రజల ముందు ఉంచబోతున్నామన్నారు. బంజారాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా తెలంగాణ వనరులను బందిపోటు దొంగల్లాగా దోచుకుంటున్నారన్నారు. తెలంగాణ వనరులను, అస్తిత్వాన్ని కాపాడే పార్టీగా ప్రాణలు ఫణంగా పెట్టి అయిన సరే ఈ భూదోపిడిని అడ్డుకుంటామన్నారు. అటు పవన్ కళ్యాణ్ కోడికుంట చెరువులో కొన్న పది ఎకరాలు శిఖం భూమేనని తేల్చిచెప్పారు. ఈ భూమిని వెంటనే తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి సాధించుకున్న తెలంగాణ…కచ్చితంగా మా జాగీరే అని స్పష్టం చేశారు.

- లక్ష కోట్ల భూదోపిడీకి స్కెచ్

పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ, లక్ష కోట్ల విలువైన భూములను బడా బాబులకు అప్పనంగా అప్పగించే భారీ కుట్రకు రేవంత్ సర్కార్ తెరలేపిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ దందాలో సీఎం సోదరులు, మంత్రులు, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. బందీపోటు దొంగల్లాగా భూములు దోచుకుంటున్న వారి బండారం బయటపెడతామన్నారు. ముఖ్యంగా మూసీ నది గర్భంలోనే నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాన్ని నిర్మిస్తున్న 'శ్రీ ఆదిత్య బిల్డర్స్' పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో ఇదే ఆదిత్య బిల్డింగ్ వద్ద మేము ధర్నా చేస్తే హైడ్రా తమపైనే దాడికి దిగిందని గుర్తు చేశారు.

మిగతాద్ది 2 లో



2లో..

## ప్రభుత్వ భూములను
# పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

- భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు

**హైదరాబాద్,జూన్6 :**
రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు.



## కాంగ్రెస్ పాలనలో
# పాలమూరుకు ద్రోహం

- తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర
- సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి
- మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**మహబూబ్‌నగర్,జూన్6 :**
కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు.

మిగతాద్ది 2 లో



# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

- ముందస్తు చర్యలకు సిద్ధం కండి
- ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు
- కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు

**హైదరాబాద్,జూన్6 :**
తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిగతాద్ది 2 లో

## వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...
# బ్లూకలర్ జాబ్స్

- పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి
- జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు
- డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూన్6**
ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు.
జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు.

2లో..

# రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

- ఇప్పుడేమో హడావిడి చేస్తే ఎలా నమ్మాలి
- ససిఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**మహబూబ్‌నగర్, :**
రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టటెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు.

మిగతాది 2లో



మిగతాది 2లో

# పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్

**పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం**

## మహిళా డ్రైవర్ల కోసం 'స్త్రీ రైడ్'..
# ప్రారంభించిన డీజీపీ

**హైదరాబాద్:**
మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.




02

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 07, 2026

# ప్రభుత్వ భూములను
# పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి

శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా.. పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ పాలనలో
# పాలమూరుకు ద్రోహం

మొదటిపేజీ తరువాయి

పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం

రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి త్టటెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని

విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

# పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్
## పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం పోచారంలోని డీబీసీలో నిర్వహించిన బర్డ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోచారం ల్యాండ్‌స్కేప్‌లో గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ఉందని దీనిని కాపాడేందుకు బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబీస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించాలని సూచించారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని, నీటి వనరులను కాపాడాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి , మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు, ఎఫ్ఆర్వోలు , బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లపాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# రూ.లక్ష కోట్ల విలువైన భూమిని
# ప్రభుత్వం బడాబాబులకు కట్టబెడుతోంది

కానీ ఆధారాలు చూపించటంతో సైలెంట్ అయిపోయారని చెప్పారు. ఆదిత్య బిల్డర్స్ వాళ్లు ఏకంగా ఏడు ఎకరాలు మూసీలో కబ్జా పెట్టారని అన్నారు. దీని వెనుక ఒక ఎంపీ ఉన్నారని కవిత ఆరోపించారు. అదే విధంగా ప్రేమవతి పేట పెద్ద చెరువుకు సంబంధించి 2021లో అనుమతులు పొంది, నాటి నుంచి నేటి వరకు ఏకంగా ఏడు ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారని మండిపడ్డారు. రూ.700 కోట్ల విలువైన ఈ భూమిపై ఏకంగా 30 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తూ వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారన్నారు. అక్కడ ఉన్న గ్రామానికి సంబంధించిన పాత నక్షను సైతం మార్చేసి తప్పులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బడా సంస్థ అయిన 'మెగా'కు చెందిన ఐకాం (Icom) అనే ఆయుధాల తయారీ సంస్థ సైతం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 59లో ఉన్న మేడి బావి, జాలు బావి చెరువుల వద్ద ఐదు ఎకరాల భూమిని కబ్జా చేసిందని చెప్పారు. దీనిపై అక్కడి మున్సిపాలిటీలోనే తీర్మానం చేసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చేస్తున్న హైడ్రాకు బడా బాబుల సంస్థలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆదిత్య బిల్డర్స్ కు సంబంధించి పూర్తి ఆధారాలను బయటపెడుతామని హెచ్చరించారు. మూసీ గర్భశోకం ఎవరికీ మంచిది కాదని, ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అప్పులు పుట్టడం లేదనే సాకుతో ఉన్న భూములను ఇలాగే అమ్ముకుంటూ పోతే, రాబోయే తెలంగాణ నెక్స్ట్ జనరేషన్ భవిష్యత్ అవసరాల కోసం భూములు ఎక్కడ ఉంటాయని కవిత ప్రశ్నించారు. తెలంగాణ భూములను ప్రభుత్వ పెద్దల కోరల నుంచి రక్షించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లైనా చట్టపరమైన లీగల్ ఫైట్ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్తు కోసం, పేద ప్రజల హక్కుల కోసం ప్రాణాలు పణంగా పెడతామన్నారు.

**▪ కాంగ్రెస్ కు అధికారం ఇదే ఆఖరి బార్**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదే ఆఖరి బార్ అని, మరో 20 ఏళ్ల పాటు ఆ పార్టీని ప్రజలు బొందపెట్టే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు ఉందని కవిత అన్నారు. తెలంగాణ వనరులను, సంపదను, భూములను ఈ ప్రభుత్వ పెద్దలు బందిపోట్ల మాదిరిగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో అక్రమాలకు, అవినీతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. నాడు, నేడు రాష్ట్రంలో నడుస్తోంది 'కేటీఆర్' పాలనేనని ఎద్దేవా చేశారు. గతంలో కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల రామారావు కాగా.. ఇప్పుడు కేటీఆర్ పాలన అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని విమర్శించారు. గతంలో ఫినిక్స్ సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తే, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఇదే రేవంత్ రెడ్డి దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మాట్లాడారని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే ఫినిక్స్ సంస్థకు మరో వంద ఎకరాలను కలిపి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుండటం ఆయన ద్వంద్వ విధానాలకు నిదర్శనమన్నారు.

**▪ పవన్ కళ్యాణ్... శిఖం భూమి తిరిగి ఇచ్చేయ్**

తెలంగాణ వచ్చిన తర్వాత 11 రోజులు అన్నం తినకుండా బాధపడ్డానని చెప్పుకున్న పవన్ కళ్యాణ్, ఆ బాధలోనే ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా 'శిఖం' భూములు కొనుగోలు చేశారని కవిత అన్నారు. సర్వే నంబర్ 706 పరిధిలోని 'కోడికుంట' చెరువుకు సంబంధించిన 10 ఎకరాల శిఖం భూమినే ఆయన కొన్నారని, ఇది పక్కా శిఖం భూమి అని ఇరిగేషన్ శాఖ సైతం నోటీఫై చేసిందని స్పష్టం చేశారు. అయితే ఈ భూమి రిజిస్ట్రేషన్‌లో భారీగా అక్రమాలు జరిగాయని, కేవలం మూడు ఎకరాలు మాత్రమే శిఖం అని చూపిస్తూ.. మిగతా భూమిని మాగాణిగా మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. శిఖం భూమి అని తేలితే ప్రభుత్వానికి వాపస్ ఇస్తానని గతంలో పవన్ కళ్యాణే స్వయంగా చెప్పారని, కాబట్టి ఇచ్చిన మాట ప్రకారం ఆయన వెంటనే ఆ 10 ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ రైతులకు చట్టప్రకారం ఎలాంటి నష్టపరిహారం ఇస్తారో, అలాగే పవన్ కళ్యాణ్‌కు కూడా నష్టపరిహారం చెల్లించి ఆ చెరువు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. చెరువులను, తెలంగాణ వనరులను కాపాడటంలో ఎవరికీ మినహాయింపులు ఉండకూడదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**▪ మీ విషకోరల్లోంచి సాధించుకున్న తెలంగాణ మా జాగీరే**

తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రశ్నిస్తే దాన్ని 'ప్రాంతీయ వాద ఉగ్రవాదం' అంటూ పవన్ కళ్యాణ్ మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఆంధ్రా విషకోరల నుంచి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ కచ్చితంగా మా జాగీరేనని, ఇక్కడి మేధావులను, జానపద కళాకారులను అవమానిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సినిమా ఇండస్ట్రీకి అత్యధిక ఆదాయం వచ్చేది నైజాం ప్రాంతం నుంచేనని, ఇక్కడ కొనుక్కుంటున్న లగ్జరీ కార్లు, వేల కోట్ల భూములు అన్నీ తెలంగాణ ప్రజలు కొన్న సినిమా టికెట్ల సొమ్మేనని గుర్తుచేశారు. ప్రజల సొమ్ముతో బతుకుతూ, ప్రజా కళాకారుడు గద్దరన్నకు ఎప్పుడో ఒక కారు కొనిచ్చానని ఇప్పుడు ప్రచారం చేసుకోవడం గద్దరన్నను, తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనన్నారు. కుడిచేత్తో చేసే దానం ఎడమచేతికి తెలియకూడదనే కనీస నైతికత లేకుండా మాట్లాడటం సిగ్గుచేటని కవిత విమర్శించారు. తెలంగాణ జానపద కళాకారుల ట్యూన్స్ వాడుకుని కోట్లు సంపాదించిన మీరు, ఏనాడైనా చిన్న కళాకారులకు రాయల్టీ ఇచ్చి ఆదుకున్నారా అని నిలదీశారు. రాజ్యాంగబద్ధంగా ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయవచ్చని, కానీ దోపిడీకి గురైన తెలంగాణ గడ్డపై మళ్లీ ఆంధ్రా సమైక్యవాదుల రాజకీయం ఏంటని వారు ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు వద్దంటున్నా 'వన్ సైడ్ లవ్' అంటూ బలవంతంగా ఇక్కడ రాజకీయం చేయాలనుకోవడం, తిరస్కరిస్తే యాసిడ్ పోస్తామనడం లాంటి వికృత ధోరణిని సహించేది లేదన్నారు. పవన్ కళ్యాణ్ ముందు ఆంధ్రా ప్రజలకు మేలు చేయాలని, మా పాలన మేము చేసుకోగలమని హితవు పలికారు. ఇక్కడ సరైన నాయకుడు లేక పవన్ కళ్యాణ్‌ను అడ్డం పెట్టుకుని రెండు ఓట్లు రాబట్టుకోవాలని బీజేపీ చూస్తోందని ఎద్దేవా చేశారు. పంజాబ్‌లో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో మాత్రం ఎందుకు ఆంక్షలు విధిస్తోందో ఇక్కడి బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ రైతుల పట్ల వివక్ష చూపిస్తున్న కేంద్ర వైఖరిని ప్రశ్నించని బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని, ఆ పార్టీకి ఉన్న ఎనిమిది మంది ఎంపీలు మళ్లీ గెలవడం కల్ల అని స్పష్టం చేశారు.

**▪ నీళ్ల మీద సీఎంకు అవగాహన లేదు**

పాలమూరు జిల్లా బిడ్డ అయి ఉండి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 30 నెలలుగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క రివ్యూ కూడా చేయకపోవడం సిగ్గుచేటని కవిత అన్నారు. తాము క్షేత్రస్థాయిలో వెంటపడి ధర్నాలు, ఆందోళనలు చేస్తేనే ప్రభుత్వం మొదటిసారి సమీక్ష నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ ముఖ్యమంత్రికి నీటి ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని, మొదట ఆయన ఆ సబ్జెక్టుపై నాలెడ్జ్ పెంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రాకు 260 టీఎంసీల నీళ్లు తీసుకోమని చెప్పడం రాష్ట్రానికి ద్రోహం చేయడమేనన్నారు. గతంలో తుమ్మడిహెట్టిని అంగీకరించని మహారాష్ట్ర సీఎం వద్దకు వెళ్లి ఏదో చేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తూ నాటకాలాడుతున్న రేవంత్ రెడ్డి, పక్క రాష్ట్రంలో ఉన్న తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడిని మాత్రం ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వెంటనే చంద్రబాబును కలిసి మనకు రావాల్సిన 200 టీఎంసీల నీటిని డిమాండ్ చేయాలని, ఒకవేళ బనకచర్లకు అంగీకరిస్తే తెలంగాణకు నీటి ద్రోహం చేసినట్లేనని హెచ్చరించారు. భవిష్యత్తులో మనకు కృష్ణా నీళ్లు సరిపోవు కాబట్టి గోదావరిలో 200 టీఎంసీల నీటిని తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**▪ ఉద్యమకారులకు భూమి ఇవ్వాల్సిందే**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే అఖిలపక్ష సమావేశానికి తమను పిలవకపోవడాన్ని ప్రభుత్వ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు కచ్చితంగా భూమి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనికోసం వచ్చే నెలలో ఉప్పల్ భగాయత్ పరిధిలో పెద్ద ఎత్తున భూపోరాటం చేయబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే నాదర్‌గుల్‌లో ఉన్న 200 ఎకరాల భూమిని కూడా వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15

తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గ్దదె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...బ్లూకలర్ జాబ్స్

మొదటిపేజీ తరువాయి

ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్ట్‌లతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళ కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు దైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్ఫర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది. ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

# మహిళా డ్రైవర్ల కోసం 'స్త్రీ రైడ్'..
## ప్రారంభించిన డీజీపీ

మొదటిపేజీ తరువాయి

విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 07, 2026

# గత నాలుగు వారాల నుండి తన తండ్రి డాక్టర్ పెద్ద నరసింహులు పిన్న తండ్రి సిద్ది రాములు పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన తనయుడుడాక్టర్ చిప్పశ్రీనివాస్

- పాల్గొన్న బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్
- వెల్దుర్తి మండల బిజెపి పార్టీ కన్వీనర్ హనుమాద్రి బాలా గౌడ్



**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి మాసాయిపేట జూన్ 6**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని స్థానిక కీర్తిశేషులు డాక్టర్ పెద్ద నరసింహులు ఆసుపత్రిలో గత నాలుగు వారాల నుండి శనివారం రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వారి తనయుడు డాక్టర్ చిప్ప శ్రీనివాస్ తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కీర్తిశేషులు పెద్ద నరసింహులు వెల్దుర్తి మండల ప్రజలకే కాకుండా ఇరుప్రక్కల మండల ప్రజలకు ఎంతో సుపరచిత్రుడని తాను బ్రతికున్న కాలం మొత్తం ప్రజల శ్రేయస్సు కోరే మహనీయ ఆరాధ్య దైవ సంపన్నుడు తాను చేసిన వైద్య సేవలు ప్రజలు నేటికీ మర్చిపోలేని గత సంగతులతో తాను తన తండ్రి పేరున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా అనుకోలేని కాల నిర్ణయ క్రమంలో తన పినతండ్రి చిప్ప సిద్ధిరాములు ఎవరు ఊహించలేని కాలానుసర కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చూపిస్తా పొందుతూ అకాల మరణాన్ని జీర్ణించుకోలేని తమ కుటుంబ సభ్యులు కాకుండా వెల్దుర్తి మండల ప్రజలను కూడా కంటతడి పెట్టించిన తన పినతండ్రి చిప్ప సిద్ధిరాములుపేరున ప్రతి శనివారం సంత వెల్దుర్తి మండల కేంద్రంలో జరుగుతున్నటువంటి సందర్భంగా ప్రజలకు ఎంతో కొంత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉద్దేశంతోనే తాను ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్ బిజెపి వెల్దుర్తి మండల కన్వీనర్ హనుమాద్రిబాలా గౌడ్ సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని వెల్దుర్తి మండల కేంద్ర గ్రామ ప్రజలు తన తండ్రి కీర్తిశేషులు డాక్టర్ పెద్ద నరసింహులు తన పిన తండ్రి చిప్ప సిద్ధిరాములుజ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఇలా ప్రతి శనివారం నాడు అన్నదాన కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహిస్తారని మునుముందు కూడా వారి జ్ఞాపకార్థం కోసం ఎన్నో సేవలు చేయాలని సంకల్పంతోనే తాను వెల్దుర్తికి రావడం జరుగుతుందని తన తండ్రి తన తండ్రి లపై వెల్దుర్తి మండల కేంద్రం ప్రజలు ఎలా ఆప్యాయతలు చూపించారు తమపై కూడా చూపించి తాను చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేసే విధంగానే తమకు సహకరించాలని వెల్దుర్తి మండల ప్రజలను కోరుతున్నానని తనకు సహకరిస్తున్న తన మిత్రులకు ఎంతో కృతజ్ఞతలు పత్రిక ముఖంగా తెలియజేయడం జరుగుతుందని ఎవరు ఎలాంటి అనుమానాలను తమపై దృష్టిని సారించకుండా తాను చేస్తున్న కార్యక్రమం పై సానుభూతితో తమ ప్రేమ ఆప్యాయతలను చూయించి తాను నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరుగుతుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు

# ఆపదలో కుటుంబానికి అండగ నిలిచిన గంగపుత్ర సంఘం



**కరపత్రం ప్రతినిది మంథని జూన్ 6**

కుటుంబానికి పెద్దన్నల ఆపదలో గంగపుత్ర సంఘం అండగా నిలిచింది. మంథని మండలం బెస్తపల్లి గ్రామానికి చెందిన బోరే సంపత్ ముంబైలో జరిగిన రైలు ప్రమాదంలో గత ఏడాది నవంబర్ 13న మృతి చెందారు. మృతుడి కుటుంబ పరిస్థితులు తెలుసుకొని బెస్తపల్లి, గట్టుప్పర్, కామరాజు నగర్, ముంబై గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ గంగపుత్ర సంఘాల ద్వారా గంగపుత్ర సంఘం నాయకులు, తెలుగు యూత్ సేవా సంఘం సభ్యులు తోకల మల్లేష్, తెలుగు యూత్ సేవా సంఘం ముంబై నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. విరాళాల రూపంలో వచ్చిన రూ. 1, 33, 530 నగదులో 1,27, 375 రూపాయలను మృతుడు సంపత్ ముగ్గురు పిల్లలకు ఎల్ఐసి లో 20 సంవత్సరాలు ఫిక్స్ డిపాజి చేశారు. మిగిలిన రూ.6,155 లను సంపత్ భార్య స్వరూపకు అందజేశారు. ఆపదలో అండగ నిలిచిన గంగపుత్ర సంఘం నాయకులకు, సహకరించిన తోకల మల్లేష్, దాసరి రాజు లకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్తపల్లి సర్పంచ్, గంగపుత్ర సంఘం నాయకులు, దుబ్బపల్లి గ్రామస్తులు, ముంబై గంగపుత్ర ఐక్యత సంక్షేమం సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ముగిసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం ప్రక్రియ మంగళపర్తి సర్పంచ్ సంధ్య రామకృష్ణ రావు

- నర్సాపూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిమెదక్ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి సహకారంతో వరి ధాన్య గోదాములకు తరలించాం సర్పంచ్ సంధ్యారామకృష్ణ రావు



**కరపత్రం వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి జూన్6**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో రైతుల ఆరు కష్టాన్ని అర్థం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి సహకారంతో మంగళపర్తి గ్రామ రైతులు పండించినటువంటి వరి ధాన్యాన్ని గోదాములకు తరలించడం జరిగిందని రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న ఆపద్బాంధవులు ఆవుల రాజిరెడ్డి హనుమన్న గారి నరేందర్ రెడ్డి సహాయ సహకారాలతో తామ అభిప్రాయ అనుసార నిత్యం వారు సానుకూలంగా స్పందించి మా గ్రామానికి అందుబాటులో ఉన్న గోదాంలోకి వరి ధాన్యాన్ని తరలించడం జరిగిందని రైతుల బాధలను అర్థం చేసుకొని స్పందించిన నాయకులకు రైతులు హర్షం వ్యక్తం చేశారు శనివారం నాడు మంగళపర్తి గ్రామాన్ని సందర్శించిన వెల్దుర్తి నూతన తాసిల్దార్ విజయలక్ష్మి రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ లతో సహా సిబ్బంది గ్రామానికి వచ్చి తమకు సహకరించి రైతులు పండించిన వరి ధాన్యాన్ని గోదాముకు తరలించినా నాయకులకు అధికారకులకు మంగల్పర్తి సర్పంచ్ సంధ్యారామకృష్ణ రావు గారికి కృతజ్ఞతలు తెలిపారు రానున్న రోజుల్లో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి దిశలోనే చేస్తానని ఈ సందర్భంగా వారు తెలియజేశారు

# కరాటేతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు



- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**కరపత్రం ప్రతినిది వేములవాడ**

కరాటే తో క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, విద్యార్థులు చదువుతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలను అలవర్చుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు అన్నారు. శనివారం పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని, తదుపరి స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవధూత రజినీకాంత్, కో-ఆప్షన్ సభ్యుడు పీర్ మహమ్మద్, సీపీఐ నాయకుడు గుంటి వేణు, కరాటే శిక్షకులు లోలోపు రాజు, దండుగుల శంకర్, పి.భాస్కర్, బి.శ్యామ్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ నగరం భాగ్యనగరమే... కె.ఎల్.ఆర్



**మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా, జూన్ 6/ జాతీయ కరపత్రం ప్రతినిది**

పర్యావరణహిత పరిశ్రమలకే ప్రభుత్వ ప్రాధాన్యం ఏడు నెలల్లోనే పాలన భవనాల నిర్మాణం పూర్తిజూన్ 10న సీఎం పర్యటన -- ఏర్పాట్లను పరిశీలించిన కె.ఎల్.ఆర్ హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతో పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతూ భాగ్యనగరం మహానగరంగా రూపుదిద్దుకుంటోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.ఎల్.ఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలతో పాటు దేశ, విదేశాల ప్రజలకు అనుకూలంగా హైదరాబాద్ నగరంపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, పాలన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.ఇప్పటికే పూర్తయిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ మరియు స్కిల్ యూనివర్సిటీ భవనాలను ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు కె.ఎల్.ఆర్ తెలిపారు.మహేశ్వరం నియోజకవర్గానికి తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీని ఆయన పరిశీలించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.

ఫార్మా పరిశ్రమల విషయంలో కూడా సాధారణ పరిశ్రమలు కాకుండా గ్రీన్ ఫార్మా వంటి పర్యావరణహిత సంస్థలకే తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కె.ఎల్.ఆర్ పేర్కొన్నారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను, ముఖ్యంగా స్థానిక రైతులను అనవసర ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు.స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు.అలాగే భూములు ఇచ్చిన రైతులకు సవరించిన ధరల ప్రకారం నష్టపరిహారం, ప్లాట్లు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**కరపత్రం ప్రతినిది వేములవాడ**

రాబోవు వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. శనివారం 4 16 17 18 19 వార్డుల్లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. తడి--పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ నరాల శేఖర్, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, పట్టణ ఎస్ఐ రామ్మోహన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ క్షేత్రస్థాయి సిబ్బంది, మెప్మా ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆయా వార్డుల మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో చెస్ క్రీడ పోటీలు.

- విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్.



**కరపత్రం ప్రతినిది కరీంనగర్**

సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 50 రోజుల పాటు విజయవంతంగా చెస్ క్రీడా శిక్షణ తరగతులు చేపట్టారు. చెస్ క్రీడా కోచ్ కొప్పర్తి శివయ్య పర్యవేక్షణలో చెస్ తరగతులను రెండు విడతలలో నిర్వహించారు. చెస్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు, చిన్నారులకు శనివారం రోజున ముఖ్యఅతిథి 49 వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ బహుమతుల ప్రధానం చేశారు. చెస్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు కె.అవిష ( మొదటి), ఎన్ సాయి (రెండవ) , కార్తికేయ మూడో బహుమతి ని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రధానంగా వేసవి సెలవుల్లో పిల్లలను ప్రోత్సహించడానికి చెస్ క్రీడ పోటీలను, కూచిపూడి, భరతనాట్యం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని సనాతన హిందూ ధర్మా సేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ సేవా సమితి నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



# సురభి శ్రీధర్ కు బెస్ట్ జర్నలిస్ట్ అవార్డ్

**కరపత్రం ప్రతినిది గోదావరిఖని జూన్ 06:**

గత 15 సంవత్సరాలకు పత్రిక రంగంలో రాణిస్తూ తనదైన శైలిలో వార్తలు రాస్తూ ప్రజల ఇబ్బందులను వార్తల రూపంలో సంబంధిత అధికారులకు తెలియజేస్తూ ప్రజలు సమస్యలు పరిష్కరించడంలో ముందుంటూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న వ్యక్తి సురభి శ్రీధర్ జ్యోతి జాతీయ దినపత్రిక ప్రారంభం దశ నుండి నేటి వరకు పాత్రికేయుడుగా కొనసాగుతున్న సురభి శ్రీధర్ ను పత్రిక ఎడిటర్ నాంపల్లి శ్రీనివాస్ ఉత్తమ పాత్రికేయుడుగా నామినేట్ జరిగింది. జాతీయ తెలుగు సరస్వత పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాళహస్తిలోని గంగా సదాన్ లో ఉత్తమ పాత్రికేయ పురస్కారం (బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు) ను, మైనార్టీ వ్యవహారాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అహ్మద్ షరీఫ్, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొంటె సాయి, జ్యోతి జాతీయ దినపత్రిక ఎడిటర్ నాంపల్లి శ్రీనివాస్, జాతీయ తెలుగు సరస్వతి పరిషత్ కార్యనిర్వాక అధ్యక్షులు కేశి రాజు రాంప్రసాద్ తో పాటు ఆలయ వేద పండితుల చేతుల మీదుగా అందుకున్నారు. తనకు బెస్ట్ అవార్డు కు నామినేట్ చేసిన పత్రిక ఎడిటర్ నాంపల్లి శ్రీనివాస్, జాతీయ తెలుగు సరస్వత పరిషత్ కార్యనిర్వాక అధ్యక్షులు కేశి రాజు రాంప్రసాద్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని సురభి శ్రీధర్ తెలిపారు.

# కరీంనగర్ లయన్స్ నేత్ర వైద్యశాలకు మూడు అంతర్జాతీయ ఐఎస్ఓ ధృవపత్రాలు



**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 6**

రేకుర్తిలోని లయన్స్ నేత్ర వైద్యశాలకు నాణ్యత, పర్యావరణ పరిరక్షణ , ఇంధన నిర్వహణ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు అంతర్జాతీయ ప్రమాణాలైన ఐ ఎస్ ఓ 9001:2015 ఐ ఎస్ ఓ 14001:2015 , ఐఎస్ఓ 50001:2018 ధృవపత్రాలను పొందింది.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ ఎం. ప్రకాష్ హోల్ల , కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి , హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య చేతుల మీదుగా ఐఎస్ఓ ధృవపత్రాలను స్వీకరించారు.ఈ ధృవపత్రాల ప్రదానం ద్వారా కరీంనగర్ లయన్స్ నేత్ర వైద్యశాల రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ , ఇంధన వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో తమ నిబద్ధతను మరోసారి చాటుకుంది.ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం వైద్యులను, సిబ్బందిని , సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు.

# తెలంగాణ వనరులు, భూములు, అస్తిత్వ పరిరక్షణే తెలంగాణ రక్షణ సేన లక్ష్యం

- భూదందాలపై ఆధారాలతో పోరాటం చేస్తాం..
- టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 6**

రాష్ట్రంలో పేదల భూములను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వ్యవహరిస్తోందని, మరోవైపు వేల కోట్ల విలువైన భూములను పెద్ద కార్పొరేట్ సంస్థలు, ప్రభావశీలులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత మాట్లాడారు. రాష్ట్రంలోని భూదందాలు, చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించిన అంశాలను ఆధారాలతో సహా దశలవారీగా ప్రజల ముందుకు తీసుకువస్తామని కవిత తెలిపారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూవ్యవహారాల్లో ఉన్నారంటూ తమ వద్ద సమాచారం ఉందని, త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

తెలంగాణ వనరులు, సంస్కృతి, అస్తిత్వాన్ని కాపాడేందుకే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశామని పేర్కొన్న కవిత, భూముల పరిరక్షణ కోసం అవసరమైతే న్యాయపోరాటాలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లి అయినా తెలంగాణ భూములను రక్షిస్తామని అన్నారు.

**– చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆరోపణలు**

కొన్ని ప్రాంతాల్లో చెరువులు, శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని కవిత ఆరోపించారు. పేదల ఇళ్లపై చర్యలు తీసుకుంటున్న అధికారులు, భారీ నిర్మాణాలు మరియు ప్రభావశీలుల ఆక్రమణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. పలు ప్రాంతాల్లో చెరువుల పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
హైడ్రా సంస్థ పేదలపై మాత్రమే చర్యలు



తీసుకుంటోందని, పెద్ద ఎత్తున జరుగుతున్న ఆక్రమణలపై కూడా సమానంగా వ్యవహరించాలన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన పాత రికార్డులు, సర్వే నంబర్లు, మ్యాపులు తమ వద్ద ఉన్నాయని, వాటిని త్వరలో ప్రజల ముందుంచుతామని చెప్పారు.

**–భూముల విక్రయాలపై ఆందోళన**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సరిచేయాలనే పేరుతో ప్రభుత్వ భూములను విక్రయించడం భవిష్యత్ తరాల ప్రయోజనాలకు విరుద్ధమని కవిత అభిప్రాయపడ్డారు. తెలంగాణ భూములు, సహజ వనరులు ప్రజల ఆస్తి అని, వాటిని ప్రైవేట్ ప్రయోజనాల కోసం వినియోగించేందుకు అనుమతించబోమన్నారు.

**–పవన్ కళ్యాణ్ భూముల అంశం ప్రస్తావన**

పవన్ కళ్యాణ్ కొనుగోలు చేసినట్లు చెబుతున్న భూముల విషయంలో కూడా వివాదాస్పద అంశాలు ఉన్నాయని కవిత పేర్కొన్నారు. ఆ భూముల స్వరూపంపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిఖం భూములపై ఎలాంటి అక్రమాలు జరిగి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

**–తెలంగాణ హక్కులు, నీటి ప్రయోజనాల కోసం పోరాటం**

తెలంగాణ రాష్ట్ర హక్కులు, భూములు, నీటి వనరుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగం, సాగునీటి ప్రాజెక్టుల అంశాల్లో రాష్ట్ర ప్రయోజనాలను ప్రభుత్వం సమర్థంగా కాపాడాలని సూచించారు.
పాలమూరు ప్రాజెక్టు, అంతర్రాష్ట్ర జలవివాదాల విషయంలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరిన ఆమె, తెలంగాణకు న్యాయమైన వాటా నీళ్లు సాధించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

**–ఉద్యమకారులకు భూముల కేటాయింపు చేయాలి**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు భూముల కేటాయింపు విషయంలో ఆలస్యం చేయకుండా నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ భూములు, వనరులు, హక్కులను కాపాడే విషయంలో రాజీ ఉండదని, "ప్రాణం పోయినా ఇంచు భూమిని కూడా దోపిడీ కానివ్వం" అని కవిత స్పష్టం చేశారు.

# 6వ వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేసిన ఏఐఎఫ్‌బీ నాయకుడు గూడెపు వంశీకృష్ణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 6**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. కాలనీవాసి, న్యాయవాది, ఏఐఎఫ్‌బీ పార్టీ యూత్ కన్వీనర్ గూడెపు వంశీకృష్ణ మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక 6వ వార్డులో నిర్వహించిన పట్టణ ప్రగతి--ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని వరద కాలువల ప్రధాన కూడళ్ల వద్ద జాలి గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాస్టిక్, చెత్తాచెదారం కాలువల్లో చేరి నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఈ చర్యలు దోహదపడతాయని వివరించారు. అలాగే కాలనీలో



నూతనంగా నిర్మించిన యోగా పార్కును వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పార్కు సమీపంలోని చేతిపంపును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఆరో వార్డులో ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్‌ను 2020లో నిర్మించిన పార్కులోకి తరలించి ప్రజలు మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓపెన్ జిమ్ సమీపంలో చెత్తతో నిండిపోయిన ఖాళీ స్థలాన్ని వెంటనే శుభ్రపరిచి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించి రహదారి భద్రతకు భంగం కలగకుండా చూడాలని విన్నవించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అంశాలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలతా నరేష్, ఏఐఎఫ్‌బీ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ జీయా ఉల్ అలీ, మున్సిపల్ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, బీజేపీ నాయకుడు మహమ్మద్ నసీరుద్దీన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- డీఎంహెచ్‌వో డా. ఏ. అప్పయ్య

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 6**



ఫార్మసీ ఆఫీసర్లు సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందులు, అలాగే పీహెచ్‌సీల నుంచి ఆరోగ్య ఉపకేంద్రాలు, సిబ్బందికి పంపిణీ చేసిన ఔషధాల బ్యాచ్ నంబర్, గడువు తేదీతో పాటు ఇతర అన్ని వివరాలను సంబంధిత రికార్డుల్లో కచ్చితంగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. ఏ. అప్పయ్య సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముందుగా వచ్చిన మందులను ముందుగా వినియోగించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ఏదైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తక్కువ వినియోగంలో ఉన్న మందులను సమీపంలోని అవసరమున్న పీహెచ్‌సీలకు బదిలీ చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల నివారణ, చికిత్సకు అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యాక్సిన్‌ల నాణ్యతకు ఎటువంటి భంగం కలగకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యాక్సిన్‌లను నిర్దేశిత ఉష్ణోగ్రతల్లో భద్రపరచాలని ఆదేశించారు. అలాగే ఔషధాల సరఫరా, నిల్వలు, పంపిణీకి సంబంధించిన అన్ని వివరాలను ఈ–ఔషధి పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని ఫార్మసీ అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఔషధాల నిర్వహణ కీలకమని, ఈ విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని డా. అప్పయ్య పేర్కొన్నారు.

# ప్రపంచ పర్యాటక రంగంలో తెలంగాణకు అరుదైన గౌరవం

- 'స్కాల్ ఇంటర్నేషనల్' ప్రెసిడెంట్‌గా ఎన్.ఎస్.ఎన్. మోహన్ ఎన్నిక..
- అభినందించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 6**

ప్రపంచ పర్యాటక రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సంస్థ అయిన స్కాల్ ఇంటర్నేషనల్‌కు తెలంగాణకు చెందిన ఎన్.ఎస్.ఎన్. మోహన్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక, హాస్పిటాలిటీ రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 94 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థలో అత్యున్నత పదవికి తెలంగాణ వ్యక్తి ఎన్నిక కావడం విశేషమని ఆమె అన్నారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎన్.ఎస్.ఎన్. మోహన్ మర్యాద పూర్వకంగా కలవగా, ఈ సందర్భంగా ఆయనను కవిత ఘనంగా అభినందించారు. ప్రపంచ పర్యాటక రంగంలో భారతదేశ ప్రతిష్ఠను మరింత



పెంచడంతో పాటు తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింతగా చాటాలని ఆకాంక్షించారు. 2026 సంవత్సరానికి స్కాల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా, 2027 సంవత్సరానికి ప్రెసిడెంట్‌గా ఎన్.ఎస్.ఎన్. మోహన్ ఎన్నిక కావడం పర్యాటక రంగానికి గర్వకారణమని కవిత పేర్కొన్నారు. ముఖ్యంగా 94 ఏళ్ల సంస్థ చరిత్రలో ఆసియా ఖండం నుంచి ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తొలి వ్యక్తిగా మోహన్ నిలవడం మరింత విశిష్టతను సంతరించుకుందని అన్నారు. తెలంగాణ ప్రజల ప్రతిభ, సామర్థ్యాలు ప్రపంచ వేదికలపై మరోసారి చాటిచెప్పిన ఈ ఘనత యువతకు స్ఫూర్తిదాయకమని కవిత పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యాటక రంగంలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎన్. మోహన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో స్కాల్ ఇంటర్నేషనల్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని కవిత విశ్వాసం వ్యక్తం చేశారు.

# దుగ్గొండి ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్ సత్య శారద

**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 6**





వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం దుగ్గొండి మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రతి ఇంటికి చేరుకుని అర్హుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు.సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్,నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సర్వేలో నాణ్యత,ఖచ్చితత్వం పాటించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి,దుగ్గొండి తహసీల్దార్ సమ్మక్క,బీఎల్‌వోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల తరపున ఆమరణ దీక్షకు సిద్ధం

- నన్నపునేని నరేందర్

**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 6**

చేనేత కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షపూరిత వైఖరి అవలంబిస్తోందని,జీఓ నెం.1ను యథావిధిగా అమలు చేసి టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్,వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 23వ డివిజన్ కొత్తవాడలో ఉమ్మడి వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేనేత భీమా,నేతన్నకు చేయూత, చేనేత లక్ష్మి,సహకార సంఘాల బలోపేతం,ముడి సరుకులపై 40 శాతం సబ్సిడీ,ప్రభుత్వ కొనుగోళ్లలో చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత వంటి పథకాల ద్వారా చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామని గుర్తు చేశారు.ముఖ్యంగా జీఓ నెం.1 అమలుతో ప్రభుత్వ శాఖలు,విద్యాసంస్థల అవసరాలకు చేనేత ఉత్పత్తుల కొనుగోళ్ల ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి




లభించిందన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. చేనేత సహకార సంఘాలకు టెస్కో ద్వారా పనులు అప్పగించాల్సిన చోట టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల మధ్యవర్తులు లాభపడుతుండగా,అసలు చేనేత కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విధానం కారణంగా సహకార సంఘాల ఉనికి ప్రమాదంలో పడిందని,వేలాది కుటుంబాల జీవనోపాధి సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.జీఓ నెం.1ను యథాతథంగా అమలు చేయాలని, గతంలో అమలైన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని,ముడి సరుకులపై సబ్సిడీ అందించాలని,చేనేత సహకార సంఘాలకు ప్రత్యక్షంగా పనులు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే



దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని,అవసరమైతే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చేనేత కార్మికుల తరపున ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసిన ఆయన,చేనేత సంక్షేమం,సహకార సంఘాల పరిరక్షణ,జీఓ నెం.1 అమలు,టెండర్ విధానం రద్దు కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ చేనేత కార్మికుల పక్షాన నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నీలంరాజు కిషోర్,భద్రయ్య,బైరి నరసయ్య,కట్ల స్వామి అజయ్ తదితర బీఆర్ఎస్ నాయకులు,చేనేత కార్మికులు,సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అన్నామలై బాటలో సుమతి వెంకటేశ్ బిజెపికి రాజీనామా చేసిన పార్టీ రాష్ట్రకార్యదర్శి

తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నానని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేష్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ పార్టీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు. అయితే, పార్టీ వీడినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, జాతీయవాదం, దేశభక్తి సిద్ధాంతాలు తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే
ఉంటాయని సుమతి వెంకటేష్ స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన కె. అన్నామలై ఇటీవల పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వంశపారంపర్య రాజకీయాలు, వ్యక్తిగత ఆరాధనలకు దూరంగా, సాధారణ ప్రజల రాజకీయం తీసుకురావడమే లక్ష్యంగా తాను సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అన్నామలై దారిలోనే ఇప్పుడు మిగిలిన కీలక నేతలు కూడా నడుస్తుండటం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రాహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. శుక్రవారమే బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనెంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మధ్యవర్తి రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.